

గత నెల కరీంనగర్‌లో జరిగిన 1500 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రాష్ట్ర చాంపియన్‌షిప్‌గా నిలిచి కప్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న కిరణ్(ఫైల్)

# పేదింట పతకాల పంట..

## ఒకే ఇంట్లో నలుగురు క్రీడా ఆణిముత్యాలు..

- తండ్రి వృత్తి మాంసం వ్యాపారి.. మిగతా సమయంలో కూలీ పనులు
- అయినా పిల్లల అభ్యున్నతికి కృషి
- ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. అన్ని తానై నిలిచిన తండ్రి మహేశ్
- చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలుపుతున్న అన్నాచెల్లెళ్లు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణింపు..
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సంధ్యారాణి, శివరాణి, రాకేశ్, కిరణ్

కొడంగల్, డిసెంబర్ 29 : పట్టుదల ఉంటే రంగం ఏదైనా రాణించొచ్చని పేదింటి బిడ్డలు నిరూపిస్తున్నారు. పట్టణంలోని ఒకే ఇంటికి చెందిన అన్నాచెల్లెళ్లు నలుగురు వివిధ క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారే కటికె మహేశ్, శోభారాణిల సంతానమైన సంధ్యారాణి, శివరాణి, రాకేశ్, కిరణ్‌లు. మహేశ్‌కుల వృత్తి అయిన మాంసం అమ్మకాలతోపాటు మిగిలిన సమయంలో కూలీ పనులకు వెళ్తూ తన పిల్లలకు ఉన్నత విద్యతోపాటు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా సహకరిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, పరిస్థితులు అనుకూలించకున్నా వారికి అండగా ఉండి ప్రోత్సహిస్తున్నాడు. దీంతో ఆ అన్నాచెల్లెళ్లు తల్లిదండ్రుల కష్టాన్ని వృథా కాకుండా క్రీడల్లో రాణిస్తూ బహుమతులను సొంతం చేసుకుంటున్నారు. కాగా పిల్లలను ఉన్నంతగా తీర్చిదిద్దినందుకు మహేశ్‌ను పట్టణంలోని పలువురు అభినందిస్తున్నారు.

### ఏఆర్ కానిస్టేబుల్‌గా సంధ్యారాణి..

పెద్ద కుమార్తె సంధ్యారాణి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. క్రీడలపై ఉన్న ఆసక్తితో బీపీఈడీ చదివి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో పాల్గొని సత్తా చాటింది. ఏఆర్ కానిస్టేబుల్‌గా ఓపెన్ విభాగంలో ఉద్యోగాన్ని సాధించింది. ఒక్క మార్కు తేడాతో ఎస్ఐ జాబ్‌ను కోల్పోయింది.



### అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న చిన్న కుమార్తె

రెండో కుమార్తె శివరాణి డిగ్రీ చదువుతున్నది. ఆమెకు అథ్లెటిక్స్ అంటే ఎంతో ఇష్టం. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక బహుమతులను కైవసం చేసుకున్నది. గత నెల గచ్చిబౌలిలో జరిగిన 5 కి.మీటర్ల దూరం రాష్ట్రస్థాయి పరుగు పందెంలో విజేతగా నిలిచి పలువురి మన్ననలు పొందింది. జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణిస్తానని నమ్మకంతో చెబుతున్నది.





### పరుగు పందెంలో సత్తా చాటుతున్న రాకేశ్

పెద్ద కుమారుడు రాకేశ్ బీఎస్సీ (అగ్రికల్చర్ డిగ్రీ) పూర్తి చేశాడు. ఈయనకు కూడా పరుగు పందెం అంటే మక్కువ. గత నెల గోవాలో జరిగిన 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించి అందరినీ అబ్బురపరిచాడు. ఇటీవల నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించాడు.

### ఆరు బంగారు పతకాలు కైవసం చేసుకున్న కిరణ్

చిన్న కుమారుడు కిరణ్ బీకాం చదువుతున్నాడు. పరుగు పందెం పోటీల్లో రాణిస్తూ ఇప్పటివరకు ఆరు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. గతనెల కరీంనగర్‌లో జరిగిన 1500 మీటర్ల పరుగు పందెం పోటీల్లో కిరణ్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌ను అందుకున్నాడు. కేసీఆర్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడ్డాయని వారు పేర్కొన్నారు.



ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

## నిత్య సాధనతో..

# ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది

- ది ఇండియన్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక సభ్యురాలు స్వర్ణమాల పత్రీ
- మహేశ్వర మహా పిరమిడ్‌లో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు

కడ్తాల్, డిసెంబర్ 29 : నిత్య సాధనతో ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని.. ఆత్మజ్ఞానంతో ఆనందమయ జీవితాన్ని గడపొచ్చని ది ఇండియన్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక సభ్యురాలు స్వర్ణమాల పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కైలాసాపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు శుక్రవారానికి తొమ్మిదో రోజుకు చేరాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాఃతకాల ధ్యానంలో ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి స్వర్ణమాల పత్రీ మాట్లాడుతూ ధ్యానులందరినీ సుభాష్ పత్రీజీ తండ్రిలాగా అక్కున చేర్చుకున్నారని తెలిపారు. పత్రీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన స్థాపించిన ధ్యాన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. శాఖహార జగత్ కోసం పత్రీజీ ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం పరిమళ పత్రీ, పరిణిత పత్రీ మాట్లాడుతూ నిత్యం ధ్యాన సాధనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని.. సత్యం మాట్లాడే వారికి ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు. ధ్యాన మహాయాగాల సందర్భంగా పత్రీజీ శక్తిస్థల్ వద్ద ధ్యానులు మౌనంగా నివాళులర్పించారు. పిరమిడ్ అభివృద్ధికి కరీంనగర్ జిల్లాకు చెందిన విజయలక్ష్మి, నాగభూషణం రూ.లక్ష, వేంపల్లికి చెందిన సూర్యప్రకాశ్‌రావు రూ.లక్ష, భారతీదామోదర్‌రెడ్డి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం రట్టి మధుసూదన్, విజయనగరం జిల్లాకు చెందిన శ్యామల రచించిన ఆహార ధర్మం, ధ్యాన పరిజ్ఞాన దీపిక పుస్తకాలను వారు ఆవిష్కరించారు. ధ్యానసభా వేదికపై కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలాపనలు అలరిస్తున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు హన్మంతురాజు, సాంబశివరావు, రాఘవరావు, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, శివప్రసాద్, మాధవి, దామోదర్‌రెడ్డి, జయలక్ష్మి, కిషన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాము, నవకాంత్ పాల్గొన్నారు.



ధ్యానులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వర్ణమాల పత్రీ



కోలాటం ఆడుతున్న మహిళలు

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

## గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు కడితే ఊరుకోం

### కందుకూరు కృతజ్ఞతా సభలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# ఫార్మాసిటీని రద్దు చేస్తే ఆ భూములు రైతులకే ఇవ్వాలి

కందుకూరు, డిసెంబర్ 29 : ఫార్మాసిటీని రద్దు చేస్తే తిరిగి ఆ భూములను రైతులకే ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతాసభకు ఆమె హాజరయ్యారు. అంతకుముందు హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... కందుకూరు వరకు మెట్రో తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఫార్మాసిటీ, మెట్రోను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం భావ్యం కాదన్నారు. ప్రజాపాలనలో ప్రజలు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ బ్యానర్లను కడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రైతుబంధును ఆపారని, ఇప్పుడు రైతులకు వేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అన్ని పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికమని చెప్పి ఎందుకు రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తరచూ అప్పులంటూ ఆరు గ్యారెంటీలు, హామీలను పక్కన పట్టడానికి ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మెగాసిటీ వస్తే యువకులకు ఉద్యోగాలు వస్తాయా ? అని ప్రశ్నించారు.

ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింహా, జడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీనర్సింహా రెడ్డి, అంజయ్యగౌడ్, బాలకృష్ణ, అధ్యక్షురాలు ఇందిరమ్మ, నాయకులు దేవేందర్, అమరేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, యూత్ నాయకులు కార్తిక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.



కందుకూరు కృతజ్ఞతాసభలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# రెండోరోజూ సందడిగా..

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ రెండోరోజూ శుక్రవారం కూడా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సందడిగా సాగింది. గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఏర్పాటు చేసిన సభల్లో ప్రజలు దరఖాస్తు ఫారాలను నింపి అధికారులకు అందజేశారు. అర్హులందరూ దరఖాస్తుల ఫారాలను నింపి గడువులోగా ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



శంకర్‌పల్లి : మోకిలలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు




మర్పల్లి : తిమ్మాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడులో..




ధారూరు : గట్టేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భువనేశ్వర్